క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

నారాయణవనం: పుత్తూరులోని అమ్మగారి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణవనంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. మండలంలోని పాలమంగళం దక్షిణం పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపింది. బీపీ, షుగర్, గైనిక్, లివర్, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు తదితర వ్యాధులతో పాటు జనరల్ మెడిసన్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేస్తామని పేర్కొంది.

షిఫ్ట్ ఆపరేటర్లకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డీఈ చిన్నరెడ్డెప్ప

నాగలాపురం: పట్టణంలోని గురుఅనుగ్రహం కల్యాణ మండపంలో గురువారం నాగలాపురం, నగరి సబ్ డివిజన్లలో ఉన్న సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లకు నాగలాపురం ఏడీ చంద్రనాయక్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి డీఈ చిన్నరెడ్డెప్ప, అమరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడీలు వెంకటముని, వంశీకృష్ణ, బాబు, ఏఈలు, జైసాయి, విజయ భాస్కర్, మోహన్, రవి, జగదీష్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో వ్యాసాశ్రమ పీఠాధిపతి


ఆలయ ధ్వజస్తంభం వద్ద వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరిస్వామి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరిస్వామి దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కన్నావరంలో వైభవంగా గంగ జాతర


పర్ణశాలలో కొలువైన గంగమ్మ

సత్యవేడు: మండలంలోని కన్నావరం గ్రామంలో బుధ, గురువారాల్లో గంగజాతర వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారికి విశేషాలంకరణ చేసి ప్రారంభించిన ఊరేగింపు గురువారం ఉదయం వరకు సాగింది. అనంతరం అమ్మవారిని పర్ణశాలలో కొలువుదీర్చారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, మాజీ ఎంపీపీ మస్తాన్, పార్టీ నాయకుల ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వీకే.పరమశివం(బాషా), మురళి, నారాయణ, శశినాయుడు, ప్రభాకర్‌రెడ్డి, బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు వరదయ్యపాళెం ఎస్ఐ

వరదయ్యపాళెం: స్థానిక ఎస్ఐ ఎం.ప్రతాప్‌ను వీఆర్‌కు పంపుతూ తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన కారణాల దృష్ట్యా ఎస్ఐ ప్రతాప్‌ను పంపుతున్నామని, ఆయనను వెంటనే రిలీవ్ చేయాలని సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. వరదయ్యపాళెం స్టేషన్ ఇన్చార్జిగా నాగలాపురం ఎస్ఐ టి.ఓబయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ఐ ప్రతాప్ జిల్లా కేంద్రంలో ఎస్‌బీ డీఎస్పీ వద్ద రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ ఫీజులపై మాట మార్చడం సరికాదు

తిరుపతి ఎడ్యుకేషన్: గత ప్రభుత్వం ఇచ్చిన జీఓలను రద్దు చేసి ఎంబీబీఎస్ ఫీజులను తగ్గిస్తామని చెప్పిన విద్యాశాఖ మంత్రి లోకేష్ నేడు ఆ విషయమై మాట మార్చడం సరికాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టగా, గత ఏడాది 5 వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయని, అయితే ఫీజులను అధికంగా వసూలు చేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ఫీజులకు సంబంధించిన అప్పటి ప్రభుత్వం జీఓను రద్దు చేస్తామని చెప్పి, నేడు హైకోర్టులో పాత ఫీజులనే కొనసాగిస్తామని మంత్రి లోకేష్ చెప్పడం ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందని విమర్శించారు. వెంటనే గత ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108జీఓలను రద్దు చేసి ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యం.. జాగ్రత్త సుమా!

- పాత ప్లాస్టిక్ బాటిళ్ల వాడకంతో అనారోగ్యం
- దీర్ఘకాలం వినియోగంతో ప్రబలుతున్న వ్యాధులు
- పాఠశాలల్లో అవగాహన కల్పిస్తే సత్ఫలితాలు



పేదరికం.. పిల్లలను తొందరగా బడికి పంపాలన్న ఆతృత.. ఏదో ఒకటిలే నీళ్లు తాగడానికే కదా అన్న నిర్లక్ష్యం.. వెరసి బావిభారత పౌరుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ఫలితంగా చిన్నారులకు వ్యాధులు ప్రబలి అనారోగ్యం పాలవుతున్నారు. నిషేధిత ప్లాస్టిక్‌పై పాఠశాలల్లో అవగాహన కల్పించాల్సిన అవశ్యకత ఉంది.


తాగేలి ప్రాథమిక పాఠశాలలో వాడేసిన శీతల పానీయాల బాటిళ్లలో నీటిని తాగుతున్న చిన్నారులు

వరదయ్యపాళెం: నాగార్జున వరదయ్యపాళెంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఉదయం వరుసగా మూడుసార్లు లేచి రెండిటికి అడిగాడు. బాత్‌రూమ్ నుంచి వచ్చి క్లాసులో కూర్చుని నీరసంగా తూలుతున్నాడు. ఇదంతా గమనించిన మాస్టర్‌కి అనుమానం వచ్చి పిలిచి అడిగాడు. నాగార్జున ఏమైందిరా..? సార్ ఉదయం నుంచి విరేచనాలు అవుతున్నాయని చెప్పాడు. వెంటనే టీచర్ విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి, విషయం చెప్పాడు. వారు రాగానే ఇక్కడి నుంచే ఆస్పత్రికి తీసుకెళ్లండని సూచించాడు. దాంతో వారు తమ బిడ్డను నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ విద్యార్థిని వైద్యుడు పరీక్షించి, విరేచనాలతో శరీరంలో నీరంతా పోయింది.. సెలైన్ పెడతాం.. అయినా మీరు ముందుగా తీసుకువచ్చినందున ఏమీ ఇబ్బంది లేదని చెప్పడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. డాక్టర్ సెలైన్ పెడుతూ విద్యార్థి తల్లి భుజాలకు ఉన్న బ్యాగ్ చూసి, ఆమెను దగ్గరకు పిలిచాడు. బ్యాగ్‌లో సీసాను పరిశీలించగా దాని కింద ప్రత్యేకంగా గమనిస్తే తప్ప కనిపించని ఫంగస్ ఉంది. డాక్టర్ వెంటనే రోజూ బాటిల్ శుభ్రం చేస్తారా.. ఎంతకాలం నుంచి వాడుతున్నారీ సీసా అని అడిగాడు. నీళ్లతో అలా చేస్తాం.. చాలా కాలంగా వాడుతున్నాడు సార్ అని చెప్పింది. మీ పిల్లవాడికి విరేచనాలు కావడానికి కారణం ఇదేనమ్మా.. ఇకపై ఇలా చేయవద్దని సున్నితంగా మందలించాడు.

ఇదండీ సంగతి..

తల్లిదండ్రులు వారికున్న బిజీ, పిల్లలను తొందరగా స్కూలు పంపాలన్న ఆతృతతో నిషేధత ప్లాస్టిక్ బాటిళ్లు వాడడంతోపాటు, వాటిని సక్రమంగా శుభ్రం చేయడంపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా వ్యాధులు ప్రబలుతున్నాయి.

ఏ పాఠశాలలో చూసినా అదే పరిస్థితి

సత్యవేడు నియోజకవర్గంలోని ఏ పాఠశాలలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో అధికశాతం విద్యార్థులు తాగి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లనే వినియోగిస్తున్నారు. సంబంధిత బాటిళ్లలో నీటిని నింపుకుని పాఠశాలకు వస్తున్నారు. కొన్ని బాటిళ్లు నెలల తరబడి వాడడంతో ఆ బాటిళ్లు మురికిమయంగా ఉన్నాయి. విద్యార్థులు వాడుతున్న బాటిళ్లను చూస్తే ఎప్పటి నుంచి వాడుతున్నారో తెలుస్తోంది. పరిశీలించిన పాఠశాలలో 750 మంది విద్యార్థులు ఉండగా అందులో 70 శాతం మంది విద్యార్థులు వాడి పడేసిన బాటిళ్లను వాడుతున్నారు. పాఠశాలలో నీటి వసతి ఉన్నా ప్రతిసారీ అక్కడకు వెళ్లలేక తాము బాటిళ్లు వాడుతున్నట్లు విద్యార్థులు జవాబివ్వడం గమనార్హం. దీనికి తోడుగా కొన్ని పాఠశాలల్లో తాగునీటి వసతి లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాడుతున్నారు. అయితే ఎలా వాడినా ముప్పే.

చైతన్య కల్పన బాధ్యత ఉపాధ్యాయులదే

ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ప్రధానంగా వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను నెలల తరబడి వాడడంతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయన్న విషయంపై విద్యార్థులను చైతన్యం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే. పరిస్థితి ఇలాగే ఉంటే విద్యార్థుల ఆరోగ్యాలకు భరోసా ఉండదని చెప్పాలి.

ప్లాస్టిక్ బాటిళ్లు విషపూరితం

విషపూరిత రసాయనాలు వాడి తయారు చేసిన ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగంతోపాటు వాటిని శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితమై వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లను కడిగి ఎండలో పెట్టడంతో ఎండ వేడికి ఆ బాటిల్ తయారీ సందర్భంగా ఉపయోగించిన రసాయనాలు కరిగి నీటిలో కలుషితమవుతున్నాయి. మరుసటిరోజు అందులోనే నీళ్లు పోసుకుని తాగడంతో పలు వ్యాధులు వస్తున్నాయి.

ప్లాస్టిక్ బాటిళ్లు వాడకపోవడమే ఉత్తమం



ప్లాస్టిక్ బాటిళ్లను వాడకపోవడమే ఆరోగ్యానికి మంచిది. ప్లాస్టిక్ బాటిళ్ల తయారీకి రకరకాల రసాయనాలను వినియోగిస్తారు. విద్యార్థులు ఎండలో పెట్టడం, నెలల తరబడి వాడడంతో అనారోగ్య సమస్యలు వస్తాయి. మొదటి జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు వీటిని గుర్తించాలి. ప్లాస్టిక్ బాటిళ్లు వాడకపోవడమే ఉత్తమం.

–డాక్టర్ ఉదయ్‌కుమార్, వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ

శ్వాసకోశ వ్యాధులకు ఆస్కారం



కూల్‌డ్రింక్స్, తాగునీటి బాటిళ్లు వాడిపడేసిన వాటిని వినియోగించడంతో శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. తాగునీటికి మార్కెట్‌లో కొన్ని బాటిళ్లను విక్రయిస్తున్నారు. వాటిని వినియోగించడంతో సమస్యలు ఉండవు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ అనిత, వైద్యాధికారి, చిన్న పాండూరు పీహెచ్‌సీ


అభ్యసనలో నూతన ఒరవడికి శ్రీకారం



మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి: బోధన అభ్యసనలో నూతన ఒరవడికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్ర శిక్ష పరిశీలకురాలు అపర్ణ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, సీఆర్పీలకు తొమ్మిది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్నివిభాగాల్లో తగిన జ్ఞానాన్ని సాధించేలా ఉపాధ్యాయులు బోధన కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చప్పరంపై ద్రౌపదీదేవి పురవిహారం



శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామివారి ఆలయంలో జరుగుతున్న వార్షిక ఉత్సవాల్లో అమ్మవారు గురువారం పురవిహారం చేశారు. ద్రౌపదీ వస్త్రాపహరణం కార్యక్రమంలో భాగంగా స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను చప్పరంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించనున్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం


ర్యాలీలో పాల్గొన్న కోర్టు సిబ్బంది, పోలీసులు

సత్యవేడు: వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని సత్యవేడు కోర్టు సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ అన్నారు. గురువారం కోర్టు సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు కలసి హెల్మెట్ వాడకంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే ట్రిబుల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహన నడిపే వారికి జరిమానా విధిస్తామన్నారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా వాహనం నడిపేతే లైసెన్సు మూడు నెలలు పాటు రద్దు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ ప్రశాంతి, బార్ అసోసియేషన్ సభ్యులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పరంధామ్, పారా లీగల్ వలంటీర్ సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బీఎన్ కండ్రిగ–సూళ్లూరుపేట రోడ్డు



సాధనవారి పాళెం వద్ద కోతకు గురైన రోడ్డు, ఉగ్గుమూడి గ్రామం అధ్వానంగా ఉన్న రోడ్డు


గాజులపెళ్లూరు గ్రామం వద్ద దెబ్బతిన్న రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ, సూళ్లూరుపేట రోడ్డు పెరిటిపాడు గ్రామం వరకు 14 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. రోజుకు 700 నుంచి 900 వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గంలో మతకాముడి, గాజులపెళ్లూరు, ఉగ్గుమూడి, ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీ, సాధనవారిపాళెం, సంతవేలూరు, సీసీఎల్ కర్మాగారం తదితర గ్రామాలు ఉన్నాయి. ఈ రహదారి గుంతలమయమై అధ్వానంగా ఉంది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొచ్చుగా తయారు అవుతుంది. రోడ్డు పై వాహనచోదుకులు వాహనాలు నడపడానికి ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

మండల అభివృద్ధికి తోడ్పాటునివ్వండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంగా పనిచేసి మండల అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ లేకుండా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రతి అధికారి నిబద్ధతతో పని చేసి, మండల ప్రగతికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా రైతలకు సబ్సిడీపై అందజేసే జీలుగ, జనుమ విత్తనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ ఉదయ భారతి, డీఈలు ప్రభాకర్‌రెడ్డి, మధుసూదనరావు, వ్యవసాయశాఖ ఏడీ సుబ్రమణ్యం, సీఐ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలపై విచారించాలి


మాట్లాడుతున్న చీనేపల్లి కిరణ్‌కుమార్

తిరుపతి కల్చరల్: క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలకు పాల్పడిన వారు, క్రీడాకారులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న వారిపై విచారణ చేసి కేసు నమోదుతో సత్వర చర్యలు తీసుకోవాలని ఏపీ జూడో సంఘం కోశాధికారి చీనేపల్లి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఏపీ జూడో సంఘం అధ్యక్షుడిగా ఆనం రామకిషోర్‌రెడ్డిని గుర్తించారని తెలిపారు. వెంకట్ నామిశెట్టిని ఆర్థిక లావాదేవీల్లో జరిగిన అక్రమాలకు జేఎఫ్ఐ సస్పెండ్ చేసిందన్నారు. అయినా వెంకట్ నామిశెట్టి జూడో సంఘం తనదేనని, సీఈఓ అని చెప్పుకుంటూ జిల్లా సంఘాలకు గుర్తింపు ఇ స్తామని లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చే స్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్పందించి క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలకు పాల్పడుతున్న వారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డీటీ చంద్రబాబు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్వోలను డీటీ చంద్రబాబునాయుడు ఆదేశించారు. గురువారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. కార్యాలయం చుట్టు పనుల కోసం ప్రజలు తిరగకుండా చూడాలని, గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. భూముల సర్వేను పూర్తి చేయాలన్నారు. పెండింగ్ భూముల సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగరాజు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

పాకాల: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరి చిప్పలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్, పాదరక్షలు భద్రపరుచు హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎస్.యువరాణి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఈఓ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేపు (జూలై 20వ తేదీ శనివారం) ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తారని, వేలం పాటలో పాల్గొనే అభ్యర్థులు రూ.1000 చెల్లించాలని, తలనీలాలు వేలంలో పాల్గొనే అభ్యర్థులు రూ.10,000 డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాట పూర్తి అయిన తరువాత హెచ్చు పాటదారు మొత్తం నగదును చెల్లించాలని వివరించారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేడుకగా పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మూడు రోజులపాటు జరుగనున్న పవిత్రోత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో శ్రీకపిలేశ్వర స్వామి, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీవిఘ్నేశ్వరస్వామి, శ్రీసుబ్రహ్మణ్యస్వామి, శ్రీచండికేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పసుపు, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ చేపట్టారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం రాకుండా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.

హోటల్ లైసెన్స్ రద్దు

తిరుమల: ఫీజు సకాలంలో చెల్లించని కారణంగా తిరుమలలోని తొమ్మిది పెద్ద హోటళ్ల(క్యాంటీన్)లో ఒకటైన, కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలోని బాలాజీ భవన్ హోటల్ లైసెన్స్‌ను టీటీడీ రద్దు చేసింది. ప్రస్తుతం హోటల్ యాజమాన్యం లైసెన్స్ ఫీజు రూ.76,04,196 చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి జూన్ నెలలో సదరు హోటల్‌కు తుది నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసినా, లైసెన్సు ఫీజు చెల్లించనందుకు హోటల్ లైసెన్స్‌ను రద్దు చేశారు. టీటీడీ రెవెన్యూ, హెల్త్, విజిలెన్స్ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం హోటల్‌ను స్వాధీనం చేసుకుంది.

మహిళా రైతు గ్రూపులు ఏర్పాటు చేయండి

సత్యవేడు: మండలంలోని ప్రతి గ్రామంలో మహిళా రైతు గ్రూపులను ఏర్పాటు చేయాలని జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి కోరారు. గురువారం శ్రీశక్తి భవన్‌లో ఏపీఎం స్వర్ణలత అధ్యక్షతన జరిగిన సంఘమిత్రల సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ ప్రభావతి మాట్లాడుతూ 15 మంది మహిళలతో గ్రూపు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో తొలి దశలో 150 గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. డ్వాక్రా సంఘాల తరహాలోనే మహిళా రైతు గ్రూపులు పనిచేస్తాయని తెలిపారు. మహిళా రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సేంద్రియ సేద్యంతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, ఆదినారాయణ, ఏరియా కోఆర్డినేటర్ విజయ, సీసీ పయని, కాంచన తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి


ర్యాలీ ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు శ్రీనివాస్‌నాయక్, బేబీరాణి

శ్రీకాళహస్తి: ద్విచక్ర వాహనచోదకులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ ధారణపై కోర్టు ఆవరణం నుంచి పెండ్లిమండపం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడంతో ప్రమాదాలు జరిగితే ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి బేబీ రాణి, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఏర్పేడు: బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి కరీముల్లా డిమాండ్ చేశారు. గురువారం ఏర్పేడు కూడలిలో సీపీఎం, ప్రగతి సంస్థ, జైభారత్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేసి, మానవహారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మూలకండ్రిగలో ఓ బాలికపై గ్రామానికి చెందిన బలరామయ్య ఈ నెల 7వ తేదీన లైంగిక దాడికి పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. చిత్తూరు కోర్టు నిందితునికి 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. అలాంటి మృగానికి కోర్టు 14 ఏళ్లు కఠిన కారాగార శిక్షను విధించాలన్నారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం, అంగన్‌వాడీ, జైభారత్, ప్రగతి సంస్థ ప్రతినిధులు రంగయ్య, వెంకటేశ్వరరావు, శిరీష, రాము, మహేష్, బాలు, పాండురంగమ్మ, భాగ్యలక్ష్మి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో వేరుశనగ రైతుకు నష్టం



బుచ్చినాయుడుకండ్రిగలో వేరుశనగ నూర్పిడి చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో వేరుశనగ రైతులు భారీగా నష్టపోయారు. బుధవారం వర్షం కురవడంతో వేరుశనగ రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలోని కనమనంబేడు, కుక్కంబాకం, నెలవాయి, పీవీకండ్రిగ, ఆలత్తూరు, బుచ్చినాయుడుకండ్రిగ, పెద్దపాలేడు, గాజులపెళ్లూరు, పల్లమాల, పార్లపల్లి గ్రామాల్లో 30 ఎకరాల్లోని వేరుశనగ పంట వర్షానికి తడిచిపోయి దెబ్బతినింది. చేతికి అందివచ్చిన వేరుశనగ పంట భారీవర్షానికి దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వేరుశనగ కాయలు వర్షానికి తడిసి, మొలకలు వస్తున్నాయి. తడిసిన వేరుశనగకాయలను ఆరబెట్టుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంట దెబ్బతినడంతో రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.